## అన్నదాన కార్యక్రమం



కీసర: అమావాస్యను పురస్కరించుకొని రాంపల్లిలోని శ్రీ మహంకాళి అమ్మవారి ఆలయంలో బుధవారం పండితులు విశేషపూజలను నిర్వహించారు. అనంతరం శ్రీరాజరాజేశ్వరి (ఎస్ఆర్ఆర్) ఫౌండేషన్ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

## ఓఆర్ఆర్‌పై ప్రమాదం

కీసర: కీసర ఓఆర్ఆర్‌పై బుధవారం తెల్లవారుజామున డీసీఎం వాహనం బోల్తా పడింది. కీసర సీఐ వెంకటయ్య తెలిపిన మేరకు.. డీసీఎం వాహన డ్రైవర్ రాజు హయత్‌నగర్ నుండి మల్కాజ్‌గిరికి గుడ్లను తరలిస్తుండగా వాహనం డివైడర్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి.

## మెరుగైన వైద్యం అందించాలి

సాక్షి, మేడ్చల్ జిల్లా: మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, బస్తీ పల్లె దవాఖానాల్లో ఉత్తమ వైద్యసేవలందించాలని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ రఘునాథస్వామి తెలిపారు.బుధవారం కలెక్టరేట్‌లోని డీఎంహెచ్‌ఓ కార్యాలయం హాలులో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. జిల్లాలో ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ పనితీరు, సీహెచ్‌సీలో ప్రాథమిక ఆరోగ్య సంరక్షణ, బాధ్యతలు, నిర్వహణపై డీఎంహెచ్‌ఓ మాట్లాడారు. ప్రాథమిక నేత్ర, ఈఎన్‌టీ సంరక్షణ సేవలు, స్క్రీనింగ్‌పై సంబంధిత వైద్యులు,సిబ్బందికి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రామీణ,అర్బన్ ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలు, బస్తీ పల్లె దవాఖానాల వైద్యులు,ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

# మహిళా సంఘాల మద్దతు ఎవరికో?

**• ప్రధాన పార్టీల వ్యూహ.. ప్రతివ్యూహాలు • 22,575 సంఘాలు.. 2.43 లక్షల మంది సభ్యులు**

సాక్షి, మేడ్చల్ జిల్లా: ఎన్నికల ప్రచారానికి గడువు దగ్గర పడుతుండటంతో.. ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు ప్రధాన పార్టీల అభ్యర్థులు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. గెలుపే లక్ష్యంగా వ్యక్తిగతంగా ఓటర్లను కలవడంతోపాటు సంఘాలతో ఆత్మీయ సమ్మేళనాలు ఏర్పాటు చేస్తూ వారి మద్దతు కూడగడుతున్నారు. ఈ నేపథ్యంలోనే మహిళా సంఘాలను ప్రసన్నం చేసుకోవడంపై పార్టీలు ప్రత్యేక శ్రద్ధతో కసరత్తు చేస్తున్నాయి. మహిళా సంఘాల సానుకూలత ఉంటే వారి మద్దతు దొరకడంతోపాటు గ్రామాల్లో, కాలనీల్లో వారి ద్వారా చుట్టుపక్కల వారిని ప్రభావితం చేసే అవకాశం ఉంటుందని భావిస్తున్న అభ్యర్థులు వీరి మద్దతుపై ప్రత్యేక దృష్టి పెడుతున్నారు.



### సామాజిక వర్గాల వారీగా సంఘాలిలా..

మల్కాజిగిరి, చేవెళ్ల లోక్‌సభ నియోజకవర్గాల పరిధిలో మొత్తం 906 గ్రామ సంఘాలలో 22,575 స్వయం సహాయక మహిళా గ్రూపులు ఉండగా ఇందులో 2,43,244 మంది సభ్యులు ఉన్నారు. ఇందులో మల్కాజిగిరి లోక్‌సభ నియోజకవర్గం పరిధిలో 118 గ్రామ సంఘాల్లో 3,383 స్వయం సహాయ మహిళా గ్రూపులు ఉండగా, ఇందులో 36,553 మంది సభ్యులు ఉన్నారు. అలాగే, చేవెళ్ల లోక్‌సభ నియోజకవర్గంలో 788 గ్రామ సంఘాలలో 19,192 స్వయం సహాయక మహిళా గ్రూపులు ఉండగా, ఇందులో 2,06,691 మంది సభ్యులు ఉన్నారు.

ఈ సంఘాల్లో సామాజిక వర్గాల వారీగా ఎస్సీ, ఎస్టీ,మైనార్టీ,బీసీ,ఓసీ స్వయం సహాయక మహిళా సంఘాలు ఉండటంతో ప్రధాన పార్టీల అభ్యర్థులు ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. ఎన్నికలకు ముందే అధికార కాంగ్రెస్ పార్టీ మహిళా సంఘాలో రాష్ట్ర స్థాయి సమావేశాన్ని నగరంలో నిర్వహించి,దిశానిర్దేశం చేసింది. అప్పటి నుంచి వారిని టచ్ పెట్టుకునేలా కసరత్తు చేసిన కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ ఎన్నికల్లో మద్దతు కూడగట్టేలా ప్రయత్నిస్తోంది. భారతీయ జనతా పార్టీ(బీజేపీ)కూడా వీరికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తూ.. మద్దతును కూడగట్టేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తోంది. బీఆర్ఎస్ మాత్రం గతంలో అధికారంలో ఉన్నప్పటి సంబంధాలతో మహిళా సంఘాలను అనుకూలంగా మలుచుకునేందుకు ప్రయత్నిస్తోంది.

### హామీలిస్తూ....

మల్కాజిగిరి, చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గాల పరిధిలో మొత్తంగా 26 మండలాలు (మల్కాజిగిరి- 5,చేవెళ్ల- 21) ఉండగా ఎక్కువ మంది సభ్యులు ఉన్న గ్రామాల్లోని బృందాలకు ప్రధాన పార్టీల నేతలు,అభ్యర్థులు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నారు. స్వయం సహాయ మహిళా సంఘాల డిమాండ్లకు అనుగుణంగా హామీలు గుప్పిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రధాన పార్టీలు తాము సూచించిన అభ్యర్థికి మద్దతుగా నిలబడటమే కాకుండా వారి బంధుమిత్రుల ఓట్లను కూడా పొందేలా పర్యవేక్షించాలని కోరుతున్నాయి. కొందరు వ్యక్తిగత హామీలు కోరుతుండగా.. మరికొందరు గ్రామాల్లో తమకు ప్రత్యేకంగా భవనాలు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తులు చేస్తున్నట్లు తెలుస్తోంది. దీనికి నాయకులు ముఖ్యంగా పార్టీల అభ్యర్థులు కూడా ఒప్పుకొంటూ వారి మద్దతు కూడగట్టుకుంటున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనే కొన్ని సంఘాల మహిళలు బహిరంగంగా ముందుకు వచ్చి మద్దతు ప్రకటిస్తుండగా.. ఇంకొన్ని సంఘాల వారు లోపాయికారిగా మద్దతు ఇస్తామని పేర్కొంటున్నారు. మహిళలు మెచ్చేలా బహుమతులు సంఘాలకు చేరేలా ..కొన్ని పార్టీల అభ్యర్థులు కసరత్తు చేస్తున్నారు. మద్దతు కూడగట్టేటమే లక్ష్యంగా ఎత్తులకు పైఎత్తులతోపాటు వ్యూహప్రతివ్యూహాలతో ప్రధాన పార్టీల నాయకులు ఆ సంఘాల సభ్యులను ఆకర్షించే ప్రయత్నంతోపాటు ఓట్లు రాబట్టేలా సర్వశక్తులు ఒడ్డుతున్నారు.

## వేసవి శిబిరం నిర్వహించడం అభినందనీయం



విద్యార్థులతో చైర్ పర్సన్ పావనీజంగయ్య, కౌన్సిలర్ రమాదేవి

ఘట్‌కేసర్: వేసవిలో విద్యార్థులు తమ సమయం వృథా చేయకుండా సమ్మర్ క్యాంపు నిర్వహించడం అభినందనీయమని మున్సిపల్ చైర్ పర్సన్ పావనీ జంగయ్య అన్నారు. మున్సిపాలిటీలోని ఎన్ఎఫ్‌సీనగర్‌లో ప్రేమ హస్తం ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమ్మర్ క్యాంపును స్థానిక కౌన్సిలర్ రమాదేవితో కలిసి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్యాంపులో తల్లితండ్రులు, ఉపాధ్యాయులను గౌరవించడం, ఆటలు, పాటలు, నృత్యం తదితర అంశాలు నేర్పించాలన్నారు. కార్యక్రమంలో విజయ ఎలిజబెత్, సేవా భారత్ డైరెక్టర్ చిరంజీవి, కమలమ్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

## కీసర పోలీస్ సేష్టన్‌లో అద్దంకి దయాకర్‌రావుపై ఫిర్యాదు

కీసర: హిందువుల మనోభావాలను దెబ్బతీస్తూ అనుచిత వ్యాఖ్యలు చేసిన కాంగ్రెస్ నాయకుడు అద్దంకి దయాకర్‌రావుపై చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్సీ మోర్చా ప్రధానకార్యదర్శి మంచాల మహేందర్ ఆధ్వర్యంలో కీసర పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసారు. మున్సిపల్ ఛైర్మెన్ కౌకుట్ల చంద్రారెడ్డి, నేలు సురస్తేష్, బుచ్చిరెడ్డి, సింగిరెడ్డివెంకట్‌రెడ్డి, శ్యాంసుందర్, రాజిరెడ్డి, కర్ణాకర్, మహేందర్, వేణుగోపాల్, రవీందర్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, గిరి, తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్‌తోనే తెలంగాణ సస్యశ్యామలం



జవహర్‌నగర్: బీఆర్ఎస్‌తోనే తెలంగాణ సస్యశ్యామలం అయిందని ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి అన్నారు. బీఆర్ఎస్ మల్కాజిగిరి పార్లమెంట్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డిని గెలిపించాలని కోరుతూ బుధవారం జవహర్‌నగర్‌లో రోడ్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా రాగిడి లక్ష్మారెడ్డి, ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డిలు మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పార్టీ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలుస్తుందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులను రాజు చేస్తే, కాంగ్రెస్ రైతులను అరిగోస పెడుతుందన్నారు. బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కొండల్ ముదిరాజ్, మాజీ మేయర్ మేకల కావ్య,నియోజకవర్గ ఇన్‌చార్జీ చామకూర మహేందర్‌రెడ్డిలు పాల్గొన్నారు.

## శామీర్‌పేట పెద్దచెరువులో వ్యక్తి మృతి

శామీర్‌పేట్: శామీర్‌పేట పెద్దచెరువులో పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. శామీర్‌పేట పోలీసులు తెలిపిన మేరకు.. బొల్లారానికి చెందిన వడ్ల నవీన్ చారి (32) స్నేహితులతో కలిసి బుధవారం శామీర్‌పేట పెద్దచెరువులో ఈతకు దిగారు. వారితో పాటు నీటిలోకి దిగిన నవీన్ కాసేపటికి కనిపించలేదు. దీంతో తోటి స్నేహితులు చుట్టుపక్కల వెతుకగా చెరువులో నవీన్ మృతదేహం తేలియాడుతున్నట్లు గుర్తించారు. బాధిత కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తులో ఉంది.



## పీసీసీ లీగల్ సెల్ కన్వీనర్‌గా చక్రపాణి

మేడ్చల్: పీసీసీ లీగల్ సెల్ కన్వీనర్‌గా మేడ్చల్ కు చెందిన సీనియర్ న్యాయవాది బర్మా చక్రపాణి నియమితులయ్యారు. ఆయనను లీగల్ సెల్ కన్వీనర్‌గా నియమిస్తు పీసీసీ లీగల్ సెల్ చైర్మన్ పొన్నం అశోక్‌గౌడ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈమేరకు ఆయనను లీగల్ సెల్ కన్వీనర్‌గా నియమిస్తూ నియమాక పత్రాలు అందజేశారు.

## బీఆర్ఎస్ అభ్యర్థిని గెలిపించుకుంటాం

కీసర: మల్కాజిగిరిలో బీఆర్ఎస్‌నుండి ఎంపీ అభ్యర్థిగా బరిలోకి దిగిన రాగిడి లక్ష్మారెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించుకుంటామని దమ్మాయిగూడ మున్సిపల్ చైర్‌పర్సన్ ప్రణితా శ్రీకాంత్‌గౌడ్ అన్నారు. బుధవారం మున్సిపల్ పరిధిలోని 14వ వార్డులో నిర్వహించిన బీఆర్ఎస్ ఎన్నికల ప్రచారంలో ఆమె పాల్గొన్నారు. ఇచ్చిన హామీలను నేరవేర్చడంలో బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు పూర్తిగా విఫలమయ్యాయన్నారు.

## రాజస్థాన్ సీఎం మాటామంతీ



మేడ్చల్: రాజస్థాన్ ముఖ్యమంత్రి భజన్‌లాల్ శర్మ మేడ్చల్ లో బుధవారం రాత్రి మార్వాడీలతో సమావేశం నిర్వహించారు. శ్రీనివాస కళ్యాణ మండపంలో మేడ్చల్ లో స్థిరపడ్డ మార్వాడీలు, ఇతర ఉత్తర భారత రాష్ట్రాల ప్రజలు, ప్రత్యేకంగా రాజస్థానీలతో సమావేశం నిర్వహించారు. సమావేశాన్ని పూర్తిగా అంతర్గతంగా నిర్వహించారు. సమావేశంలో ఎంపీ అభ్యర్థి ఈటెల రాజేందర్, మాజీ ఎమ్మెల్సీ రాంచందర్‌రావు పాల్గొన్నారు.

## భూ వివాదంలో ముగ్గురి రిమాండ్

మేడ్చల్ రూరల్: తమ వ్యవసాయ భూమిలో పనులు చేసుకుంటున్న భూ యజమానులపై దాడికి పాల్పడిన ఘటనలో ముగ్గురిని రిమాండ్‌కు తరలించగా పలువురిపై మేడ్చల్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన మేరకు.. మండలంలోని మైసిరెడ్డిపల్లి గ్రామ రెవెన్యూ పరిధిలోని తమ నాలుగున్నర ఎకరాల వ్యవసాయ భూమిలో సోమవారం సాయంత్రం యజమానులు పట్నం రాజు అతని సోదరుడు భాస్కర్, కుటుంబ సభ్యులు పనులు చేసుకుంటున్నారు. ఎల్లంపేట్, మైసిరెడ్డిపల్లి, కళ్లకల్ గ్రామాలకు చెందిన చెందిన కొందరు వ్యక్తులు ఆ స్థలంలోకి వెళ్లి తమ పొలం అంటూ పట్నం రాజు అతని కుటుంబ సభ్యులపై తన వెంట తెచ్చుకున్న మారణాయుధాలు, కర్రలతో దాడికి పాల్పడ్డారు. దీంతో బాధితుల ఫిర్యాదు మేరకు సంఘటన స్థలికి చేరుకున్న పోలీసులు కర్రలు, మారణాయుధాలు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు పలువురుపై కేసులు నమోదు చేయగా మైసిరెడ్డిపల్లి గ్రామానికి చెందినతీగల కృష్ణ, తీగల శేఖర్, ఎల్లంపేట్‌కు చెందిన తలారి రాజును బుధవారం రిమాండ్ తరలించినట్లు పోలీసులు తెలిపారు.

### చెరువులో మృతదేహం లభ్యం

మేడ్చల్ రూరల్: మేడ్చల్ పట్టణంలోని పెద్ద చెరువులో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. ఎస్ఐ మాజీద్ అలీ తెలిపిన మేరకు.. బుధవారం సాయంత్రం గుర్తుతెలియని వ్యక్తి (30–35 మధ్య వయస్సు) మేడ్చల్ పెద్ద చెరువులో పడి మరణించినట్లు గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహన్ని వెలికితీసి కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. మృతుడు ప్రమాదవశాత్తు నీటిలో పడిపోయాడా లేక ఆత్మహత్యకు పాల్పడ్డి మరణించాడా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

### క్వారీ గుంతలో మృతదేహం లభ్యం

పోచారం: అన్నోజిగూడలోని క్వారీ గుంత వద్ద బీటెక్ విద్యార్థి యశ్వంత్ సెల్ఫీ దిగుతూ ప్రమాదవశాత్తు కాలుజారి గుంతలో పడి మంగళవారం మధ్యాహ్నం గల్లంతైన విషయం తెలిసిందే. యశ్వంత్‌ను వెలికితీసేందుకు ఎన్డీఆర్ఎఫ్ బృందం చర్యలు చేపట్టింది. బుధవారం సాయంత్రం యశ్వంత్ మృతదేహం లభించినట్లు పోచారం పోలీసులు తెలిపారు. మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. గురువారం పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని తల్లిదండ్రులకు అందజేస్తామని సీఐ రాజు తెలిపారు.

### విద్యుత్ షాక్‌తో వ్యక్తి..

శామీర్‌పేట్: పోల్ట్రీ ఫామ్‌లో విద్యుత్ షాక్‌తో ఓ వ్యక్తి మృతి చెందాడు. శామీర్‌పేట పోలీసులు తెలిపిన మేరకు.. తూంకుంటకు చెందిన కందెల లక్ష్మణ్ (26) బుధవారం మున్సిపాలిటీలోని పోల్ట్రీ ఫామ్‌కు చెందిన దాణా సంచులను ట్రాక్టర్ నుండి మోటార్ల సాయంతో దించుతున్నాడు.ఈ క్రమంలో విద్యుత్ వైర్ తగిలి లక్ష్మణ్ కిందపడిపోయాడు. ఆసుపత్రికి తరలించగా మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

### చికిత్స పొందుతూ మహిళ..

మేడ్చల్‌రూరల్: రోడ్డు ప్రమాదానికి గురై చికిత్స పొందుతున్న గుర్తు తెలియని మహిళ మృతి సంఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ మాజీద్ అలీ తెలిపిన మేరకు.. ఈ నెల 2వ తేదీన మేడ్చల్ పట్టణంలోని సీజన్ బార్ ఎదురుగా 30–35 ఏళ్ల మధ్య వయస్సు గల గుర్తుతెలియని మహిళ రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టింది. దీంతో తీవ్ర గాయాలపాలైన మహిళను చికిత్స నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మరణించింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



మేడ్చల్‌లో కాంగ్రెస్ నాయకులు



# ప్రచార హోరు

ఎన్నికల తేదీ సమీపిస్తున్న కొద్దీ వివిధ పార్టీల నాయకులు ప్రచార హోరును పెంచారు. బస్తీలు, కాలనీల్లో ఇల్లిల్లూ తిరుగుతూ ఓటువేయాలని అభ్యర్థిస్తున్నారు. ప్రతి ఓటరును కలిసి కచ్చితంగా మద్దతు తెలపాలని, గెలిచిన తరువాత అండగా ఉంటూ సమస్యలు పరిష్కరిస్తామని పేర్కొంటున్నారు. ప్రధాన పార్టీల అభ్యర్థులు, ఇండిపెండెంట్లు చురుగ్గా ప్రచారం చేస్తున్నారు.

మేడ్చల్ ఎంపీపీ రజిత ఇంట్లో బీజేపీ నాయకుల ప్రచారం



## కాంగ్రెస్

### ఇంటింటి ప్రచారం ఉధృతం చేయండి

ఘట్‌కేసర్: ఎన్నికలు సమీపిస్తున్నందున మల్కాజ్‌గిరి కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి సునీత మహేందర్‌రెడ్డిని గెలిపించడానికి ఇంటింటి ప్రచారం ఉధృతం చేయాలని మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి అన్నారు. పట్టణంలో మున్సిపల్ చైర్ పర్సన్ పావనీ జంగయ్యతో కలిసి వారి నివాసంలో పోల్ మేనేజ్‌మెంట్‌పై బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల రోజు పోలింగ్ ఏజెంట్లు, పోలింగ్ కేంద్రాల బయట ఉండే వారు ఓటర్ లిస్టుపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాజేశ్, మున్సిపల్ ప్రధాన కార్యదర్శి రాధాకృష్ణముదిరాజ్ పాల్గొన్నారు.

మేడ్చల్: మేడ్చల్ మున్సిపాలిటికి చెందిన బీఆర్ఎస్ కౌన్సిలర్లను కాంగ్రెస్ పార్టీలో చేరాలని నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జ్ తోటకూర వజ్రేష్‌యాదవ్ కోరారు. మేడ్చల్ పట్టణంలో పలువురు బీఆర్ఎస్ కౌన్సిలర్లు, నాయకులను ఆయన కలిశారు. 15వ వార్డు కౌన్సిలర్ హరికృష్ణ యాదవ్, 23వ వార్డు కౌన్సిలర్ కౌడే మహేష్‌తో కలిసి సమావేశం నిర్వహించారు. సమావేశంలో నాయకులు కౌన్సిలర్లు మల్లేష్‌గౌడ్, రాఘవేందర్‌గౌడ్, చాపరాజు, మధుకర్ యాదవ్, శివకుమార్ యాదవ్,స్వామి యాదవ్, శ్రవణ్ కుమార్, హరికృష్ణ, మహేష్,దేవ, నరెందర్, రవిందర్ వైస్ చైర్మన్ రమేష్ తదితరులు ఉన్నారు.

మేడ్చల్: ఎన్నికల తేదీ దగ్గర పడుంటడంతో మేడ్చల్ కాంగ్రెస్ నాయకులు ప్రచార జోరును పెంచారు. పట్టణ నాయకులు తమ వార్డులలో ప్రచారం చేస్తున్నారు. నాయకులు ఇంటింటికీ వెళ్ళి కరపత్రాలు అందజేసి తమ పార్టీ అభ్యర్థి సునీత మహేందర్ రెడ్డికి ఓటు వేయాలని కోరుతున్నారు.

కీసర: సీఎం రేవంత్‌రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకున్న మల్కాజిగిరి పార్లమెంట్ ఎన్నికల్లో పట్నం సునీతామహేందర్‌రెడ్డిని గెలిపించుకుందామని సీఎం వ్యక్తిగత పరిశీలకుడు అనిల్‌రెడ్డి అన్నారు. బుధవారం గోధుమకుంట గ్రామంలోని వివిధ కాలనీల్లో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలుచేస్తున్న 6 గ్యారెంటీలను పెద్ద ఎత్తున ప్రజల్లోకి తీసుకెళ్లి పార్లమెంట్‌ఎన్నికల్లో ప్రజలంతా చెయిగుర్తుకు ఓట్లు వేసేవిధంగా కార్యకర్తలు చూడాలన్నారు. కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కోలకృష్ణా యాదవ్, వర్కింగ్ ప్రెసిడెంట్ రామిడివిజయ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీ

### రైతులను మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

ఘట్‌కేసర్: బీఆర్ఎస్ లాగే కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేస్తోందని ఎంపీపీ ఏనుగు సుదర్శన్ రెడ్డి విమర్శించారు. ఎదులాబాద్, మాదారంలో మంగళవారం రాత్రి కురిసిన వర్షానికి తడిసిన ధాన్యం కుప్పలు బుధవారం పరిశీలించారు. ఎంపీపీ మాట్లాడుతూ నెల ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రోజులుగా ధాన్యం కుప్పలుగా ఉంటే కొనుగోలు చేయడం లేదని, దీంతో ప్రైవేటు వ్యాపారులకు విక్రయించవలసిన దుస్థితి నెలకొందన్నారు. తడిసిన ధాన్యం కొనుగోలు చేయాలని లేని పక్షంలో రైతుల పక్షాన ఉద్యమం చేపడతామని హెచ్చరించారు.

### బీజేపీ నేతల ప్రచారం...

ఘట్‌కేసర్:బీజేపీ ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్‌ను గెలిపించాలని బీజేపీ మున్సిపల్ అధ్యక్షప్రధాన కార్యదర్శి .హనుమాన్, రామతీర్థ అన్నారు. మల్కాజ్‌గిరి ఎంపీగా బీజేపీ అభ్యర్థి ఈటెల రాజేందర్‌ను గెలిపించాలని మున్సిపాలిటీలోని బొక్కొనిగూడలో బుధవారం ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలో నరేంద్రమోదీ ప్రభుత్వం మూడో సారి రావాలంటే కమలం గుర్తుకు ఓటేయాలని కోరారు. వీరేశం, మహిపాల్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి,శశికాంత్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

### బీఆర్ఎస్ నాయకుల ఇళ్లల్లో బీజేపీ నాయకుల ప్రచారాలు

మేడ్చల్: మేడ్చల్ ఎంపీపీ బీఆర్ఎస్ నాయకురాలు రజిత రాజమల్లారెడ్డి ఇంటికి వెళ్ళి బీజేపీ అభ్యర్థి ఈటెల రాజేందర్ కోడలు క్షమిత ప్రచారం నిర్వహించారు. మండలంలోని డబీల్‌పూర్ గ్రామంలో ఎంపీపీ రజిత రాజమల్లారెడ్డి నివాసానికి మండల నాయకులతో కలిసి వెళ్ళి బీజేపీ కరపత్రాలు అందజేసి ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు నందారెడ్డి, శైలజ, తదితరులు ఉన్నారు.